క్లుప్తంగా

ప్రార్థన వేదికలు రాజకీయాలకు అతీతంగా ఉండాలి

ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: ప్రార్థనా సమాజ వేదికలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ భయభక్తులు కలిగి ప్రభువును ఆరాధించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కోరారు. మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు శివారులోని కృపా సమాజం ప్రార్థనా మందిరంలో ఆదివారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఆర్కే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సమాజంలో ప్రేమ, కరుణ, శాంతి, సహనం వంటి గుణాలను పాటించాలని క్రైస్తవ్యం బోధిస్తుందన్నారు.

కార్మెల్‌మాతకు పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై వెలసిన కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు తరలివచ్చారు. నంద్యాల, కనిగిరి, మేదరమెట్ల, ధర్మవరం, బాపట్ల ప్రాంతాల నుంచి పలు వాహనాలు, రైలు, బస్సుల్లో భక్తులు వచ్చారు. కార్మెల్‌మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ఓటర్లుకు భరోసా కోసమే పోలీస్ కవాతు

నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ రవికాంత్



మంగళగిరి: ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుకూల వాతావరణం నెలకొల్పడంలో రాజీపడబోమని నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ రవికాంత్ అన్నారు. మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మంగళగిరి రూరల్ సీఐ వెంకట్రావు, రూరల్ ఎస్ఐ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

పెదపరిమిలో..

పెదపరిమి(తాడికొండ): శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలు సహకరించాలని తుళ్లూరు సీఐలు షేక్ సుభానీ, అనురాధా సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తుళ్ళూరు మండలం పెదపరిమి, అనంతవరం, వడ్డమాను గ్రామంలో కేంద్ర పోలీసు బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

తాడేపల్లి ఎస్ఐగా ప్రతాప్ కుమార్



తాడేపల్లిరూరల్: పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ప్రతాప్ కుమార్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు నిర్వహించారు. ప్రతాప్ రాకతో తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐల సంఖ్య మూడుకు చేరింది.

రేపు నృసింహస్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొని భక్తులకు ఏర్పాట్లపై సమీక్ష చేస్తారని తెలిపారు.

విలువ జోడింపుతోనే రైతుకు ఆదాయం

హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ

గుంటూరు రూరల్: పంటలకు విలువల జోడింపుతో రైతులు మంచి ధరలు పొందవచ్చని హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న రైతులకు శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని ఆనందంగా కొనసాగించలేకపోతున్నారన్నారు. సాగు లాభాదాయకంగా కొనసాగాలంటే దిగుబడులకు విలువ జోడిరపే సరైన మార్గమని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో వరి, అపరాల సాగు, సేంద్రియ సాగులో ఉపయోగించే వివిధ రకాల కషాయాలు, ద్రావణాల వివరాలు, వాటి ఉపయోగాలు రైతు శివనాగమల్లేశ్వరరావు వివరించారు. జామ సాగురైతులు నెమటోడ్స్ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, దీనికి సేంద్రియ సాగే సరైన దారని రైతు శబరినాథ్ తన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. బహుళ అంచెల సాగు గురించి ప్రకృతి రైతు ఏడుకొండలు తెలిపారు. వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, వివిధ యంత్ర పరికరాల వివరాలు, ధర, పనిచేసే విధానాలను రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు.

సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- ఇప్పటంలో రూ.30 కోట్లతో పనులు
- మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాం
- ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే, మాజీ ఎమ్మెల్యే కమల

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత మంగళగిరి నియోజకవర్గం మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. ఆదివారం రాత్రి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, జగనన్న కాలనీలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి పనిచేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతానికి రూ.20 కోట్ల వరకు ఖర్చు చేశామని తెలిపారు. ఇప్పటంలో ఐదేళ్లలో రూ.30 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటానికి కార్పొరేషన్ హంగులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇక్కడ చూద్దామన్నా ఇక్కడ గ్రావెల్ రోడ్ కనిపించదని, ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్‌గా, బీటీ రోడ్‌గా నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పాలేటి కృష్ణవేణి, తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, వైఎస్సార్‌సీపీ ఇప్పటం అధ్యక్షులు లచ్చి వెంకటేశ్వర్లుతో పాటు లచ్చి తులసిదాస్ గౌడ్, హరిబాబు గౌడ్, బ్రహ్మారెడ్డి, రామిరెడ్డి, వాకా రామ్‌గోపాల్ గౌడ్, బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఇప్పటం జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జగనన్న కాలనీలో 40 మంది అక్కాచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పక్కా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, సర్దార్ గౌతు లచ్చన్న, చాకలి ఐలమ్మ కల్యాణ మండం వద్ద ఉన్న మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్‌ను ప్రారంభించారు. 60 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసిన బీటీ రోడ్‌లో



జగనన్న కాలనీలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పాలేటి కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, ఇప్పటం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు లచ్చి వెంకటేశ్వర్లు, లచ్చి తులసిదాస్ గౌడ్, హరిబాబు గౌడ్, బ్రహ్మారెడ్డి, రామిరెడ్డి, వాకా రామ్‌గోపాల్ గౌడ్, బీసీ సెల్‌నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



ఎంపీపీ పాఠశాలలో పోలియోచుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ



సీతానగరం పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ శాంతకుమారి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నేటి చిన్నారులే రేపటి దేశ భవిష్యత్ అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వీవర్స్ కాలనీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించినప్పటికీ ఎక్కడైనా చిన్న చిన్న పొరపాట్లు ఉంటే వాటిని కూడా సరిదిద్దేందుకు ఈ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన 106 పోలింగ్ బూతుల్లో 17,500 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

పోలియోకేంద్రాలు పరిశీలన..

మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని పలు ప్రాంతాల్లోని పోలియో కేంద్రాలను ఎస్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి శ్రావణ్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని 113 తాళ్లూరు వెళ్లే దారిలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలకు పోలియోచుక్కలు అందాయా లేదా అని ఆరోగ్యసిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ప్రతి ఒక్కరికి పోలియోచుక్కలు వేసేలా మొబైల్‌వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

వాడవాడలా పల్స్ పోలియో

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి మండల, రూరల్ పరిధిలో, దుగ్గిరాల మండల పరిధిలోను పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ఉదయం 6 గంటలకే ప్రారంభమైంది. తాడేపల్లి పట్టణ పరిధిలో డోలాస్‌నగర్, అంబేడ్కర్ కాలనీలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 12 ప్రాంతాల్లో మొత్తం 2068 మంది 0–5 ఏళ్ల లోపు చిన్నారులు ఉండగా 2023 మందికి పోలియో చుక్కలు వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి నివసిస్తున్న సంచార జాతులు 33 మంది చిన్నారులు ఉండగా 31 మందికి పల్స్ పోలియో చుక్కలు అందజేసినట్లు డాక్టర్ మానస తెలిపారు. సీతానగరం పీహెచ్‌సీ పరిధిలో 12 బూత్‌లలో 2488 మందికి పల్స్ పోలియో చుక్కలు అందజేయాల్సి ఉండగా 175 మందికి అదనంగా పోలియో చుక్కలు అందజేసినట్లు డాక్టర్ శాంత కుమారి తెలిపారు. కుంచనపల్లిలో 2045 మంది పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2025 మందికి చుక్కలు వేసినట్లు డాక్టర్ నాగేంద్ర తెలిపారు.



దుగ్గిరాలలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

దుగ్గిరాల మండల పరిధిలో దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రహమాన్ మాట్లాడుతూ దుగ్గిరాలలో 15 పల్స్ పోలియో బూత్‌లు ఉండగా 2294 మంది 0–5 ఏళ్ల లోపు చిన్నారుల ఉన్నారని, సాయంత్రం 5 గంటల వరకు 2219 మందికి పోలియో చుక్కలు అందించామని ఆయన తెలిపారు. ఈమని వైద్యులు డాక్టర్ శ్రీవల్లి మాట్లాడుతూ 11 బూత్‌లలో 1433 మంది ఉండగా 1408 మందికి పోలియో చుక్కలు వేశామని ఆమె తెలిపారు. దుగ్గిరాల గ్రామంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈమనిలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ పాల్గొని పోలియో చుక్కలు వేశారు. సోమ, మంగళవారాల్లో కూడా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించలేదో వారికి ఇంటివద్ద వేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని పలువురు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో సర్పంచులు బాణావత్ ఖుషీబాయి, కె.పద్మావతి, ఉన్నం ఝాన్సీరాణి, ఇత్తడి రమేష్‌బాబు, దాసరి సుందరమ్మ, కొండూరు సుధారాణి, పలుకూరు మేరమ్మ, షేక్ అజీజున్, బి.శ్రీనివాసరెడ్డి, గంపల గంగాధరరావు పాల్గొన్నారు.

పోలియోరహిత సమాజం కోసం కృషి

ఫిరంగిపురం: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో 0–5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ చైర్మన్ రావూరి బాలరాజు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 5ఏళ్ల లోపు చిన్నారులు 2,557 మందికిగాను 2,476మందికి పోలియోచుక్కలు వేసినట్లు వైద్యాధికారులు ఫరీనాబేగం, ఎస్తేరురాణి తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో 'మానవత' ముందంజ

తెనాలి: స్వచ్ఛంద సంస్థ మానవత ఆధ్వర్యంలో వివిధ రంగాల్లోని ప్రముఖులు సమాజసేవకు తమ వంతు సహకారాన్ని అందించడానికి ముందుకు రావటం సంతోషకరమని సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. సంస్థ సర్వసభ్య సమావేశం ఆదివారం ఇక్కడి ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలోని లైబ్రరీ హాలులో నిర్వహించారు. సంస్థ కార్యకలాపాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని, కమిటీ నిర్ణయాల ప్రకారం కొనసాగాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన పట్టణ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవ పారదర్శకంగా ఉన్నపుడు దాతలకు కొదవ ఉండదని నిరూపణ అయిందన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువుకు సాయం, ఉపాధికి తోడ్పాటు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణతో ఉపాధిని సాధించుకునేలా చూడటం సంస్థ ద్వారా చేపట్టాలని కమిటీ సమావేశంలో నిర్ణయించినట్టు చెప్పారు. స్థానిక శాఖా గ్రంథాలయం నిర్వాహకులు కోరిన విధంగా రూ.55 వేల విలువైన ఫర్నిచర్, ఫ్యాన్లను సమకూర్చిన సంస్థ సభ్యులను అభినందించారు. హైదరాబాద్‌లో ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతున్న పేద విద్యార్థిని విశ్వ నాగశ్రీకి మానవత తరపున విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లేపెద్ది హనుమంతరావు రూ.50 వేల చెక్కును ఆమె తాతయ్యకు అందజేశారు. వివిధ రంగాల్లో ప్రముఖులైన మానవత సభ్యులు డాక్టర్ కేఎల్ఎస్ పద్మావతి, ఎం.అర్జునరావు, పరిమి శ్రీనివాస్, ఎస్.కృష్ణమూర్తి, నారాయణ, ఎస్.జయశేఖరరాజులు తమ పరిజ్ఞానంతో మానవత సభ్యులకు అందించగల సహకారాన్ని సభాముఖంగా వివరించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కల్యాణి, కార్యదర్శి తన్నీరు శ్రీనివాసబాబు, ఉపాధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎస్వీ శర్మ, కోశాధికారి పి.వెంకట్, వెంపటి సత్యనారాయణ మాట్లాడారు.



విద్యార్థిని చదువుకు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న హనుమంతరావు

సింహ వాహనంపై మల్లికార్జునుడు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ గంగా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సింహ వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయర్థో ఏ రామకోటిరెడ్డి ఉత్సవాలను పర్యవేక్షించారు.

పవర్ లిఫ్టింగ్ టీమ్ సెలక్షన్ పోటీలు



మంగళగిరి: నగరంలోని ఫిట్‌జోన్ జిమ్ ఆవరణలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సీనియర్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ టీమ్ సెలక్షన్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ్ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధానీ తెలిపారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 50 మందికి పైగా పవర్ లిఫ్టర్లు హాజరైనట్లు చెప్పారు. ఈ సెలక్షన్ పోటీలకు రిఫరీలుగా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి భాస్కరరావు, బి చంద్రిక, జాయింట్ సెక్రటరీలు ఘట్టమనేని సాయి రేవతి, ఎస్‌డీ మస్తాన్ వలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆళ్ల పవన్‌కుమార్ వ్యవహరించారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

మేడికొండూరు: సంక్షేమ ఫలాలు అందించి ప్రతి ఒక్కరి మనసులో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారని, ప్రజలు ముఖ్యమంత్రిగా మళ్లీ ఆశీర్వదించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమ్మేళన ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేసిందని చెప్పారు. రానున్న ఎన్నికలలో జగనన్న 175 అసెంబ్లీ స్థానాలలో అన్ని స్థానాలు గెలుచుకొని విజయ బావుటా ఎగరేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, పార్టీ మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు కే సామ్రాజ్యం సభ్యులు వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొరివి చెన్నయ్య, సొసైటీ అధ్యక్షులు వి.జయరావు, షేక్ గాలి, బి.సుబ్బారెడ్డి, కొరివి కిషోర్, అజయ్, రంగిశెట్టి బిట్టు, కే నాగేశ్వరావు, ఉడతా ప్రభాకర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.



మేడికొండూరు ఎస్సీ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుచరిత

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చిర్రావూరులో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆదివారం వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. రత్నప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే సమాజ సేవను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. వ్యవసాయ కళాశాల విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ వారం రోజులుగా చిర్రావూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆత్మరక్షణలో మెలకువలను నేర్పించడం, వేసవి కాలంలో నీటి పొదుపు గురించి ఇంటింటికి తిరిగి వలంటీర్లు అవగాహన కల్పించారని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెరటిలో పెరిగే మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రతలో భాగంగా మంచి నీటి ట్యాంకు పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయడం, ఎండ తీవ్రత నుంచి ఎలా రక్షించుకోవాలో సూచనలు చేయడం నిర్వహించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.ప్రభావతి పర్యవేక్షణలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించినట్లు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ అభినందించారు.



చిర్రావూరులో తాగునీటి ట్యాంక్ వద్ద శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో గతంలో ఉన్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని నిరసన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. యూనియన్ నాయకులు కూరపాటి శామ్యూల్ మాట్లడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యానికి కార్మికులందరికి వెంటనే జీతాలు చెల్లించాలని ఆర్డర్ పాస్ చేశారని చెప్పారు. యాజమాన్యం పట్టించుకోకుండా భూములను అమ్ముకుని కార్మికులను రోడ్డును పడవేశారని ఆరోపించారు. సమావేశంలో బి.సూర్య ప్రకాష్, వై.యోవాషు, కె.ఆదినారాయణ, బి.నవనీతం, శారద, బాషా, ఆరిఫ్, రహంతుల్లా, సింగ్, లక్ష్మి, మంగ కొండమ్మ, శంకరరావు, ఆశీర్వాదం, దుర్గ, జానీ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి పునరంకితం కావాలి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పి. పార్వతి

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి ఉపాధ్యాయులు పునరంకితం కావాలని పాఠశాల విద్యాశాఖ కో–ఆర్డినేషన్ డైరెక్టర్ పి. పార్వతి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు మండల పరిధిలోని ఉపాధ్యాయులు పి.నరసింహారావు, బి.బ్రజితరాణి, బి.సుమతి ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్వతి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు అప్‌డేట్ అయ్యి భావి భారత పౌరుల్ని తయారు చేయాలని సూచించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పూర్వ నాయకులు, ఉపాధ్యాయుల త్యాగం, అంకితభావంతోనే నేటితరం ఉపాధ్యాయులు అనేక సౌకర్యాలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ గతంలో ఉద్యోగ విరమణ పొందితే కుటుంబ పరిస్థితి ఏమిటో అని బాధపడే పరిస్థితులు ఉండేవని, ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయుల ముఖంలో ఆనందం వెల్లి విరుస్తోందన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఎంఈవో–2 జ్యోతి కిరణ్, ఉర్దూ డీఐ షేక్ ఖాసిం, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాలీద్, జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.ఎన్ మూర్తి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరామకృష్ణ, బాలరాజు, జి.దాస్, ఏపీటీఎఫ్ జిల్లా మహిళా కార్యవర్గ కన్వీనర్ భారతి, మల్లీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గృహ, వాణిజ్య నిర్మాణాలకు ఉచిత నీటి సరఫరా

ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగరపాలక సంస్థ పరిధిలో గృహ, వాణిజ్య నిర్మాణాలకు ఉచితంగా చీకటి కోనేరులో నీటిని సరఫరా చేసేందుకు నిర్ణయించుకున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన సుమారు లక్ష రూపాయల నిధులతో కొనుగోలు చేసిన మోటారును ఆదివారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన నీటిని ఉచితంగా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ ప్రజలకు అవసరం అయితే నీటిని సరఫరా చేయడం జరుగుతుందని, అదే విధంగా కార్పొరేషన్ పరిధిలో ఇటీవల నాటిన మొక్కలకు నీరు పోయడానికి చీకటి కోనేరు నీటిని ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారి యొక్క నీటి ఇబ్బందిని తొలగించడానికి ముందుకు వచ్చిన ఆలయ అధికారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే అభినందించారు. ఇవి తాగడానికి ఉపయోగపడవని, కేవలం వివిధ అవసరాల వాడకానికి మాత్రమే ఈ నీటిని ఉపయోగించాలని సూచించారు. నీటి అవసర ఉన్న వారు ట్యాంకర్లను తెచ్చుకుంటే ఉచితంగా నింపి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.